సాక్షి
మహబూబాబాద్
ఆదివారం | 15 | జనవరి | 2023



చరిత్రలో నిలిచేలా ఆవిర్భావ సభ
దేశ చరిత్రలో నిలిచేలా ఖమ్మం వేదికగా నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నిర్వహిస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు.
- 8లో▸



వీరభద్రుడికి వీరబోనం
కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో భోగి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.1°/14.8°

వాతావరణం
ఉదయం పొగమంచుతో చలి ఉంటుంది. మధ్యాహ్నం నుంచి తేమతో కూడిన వాతావరణం ఉండి, రాత్రి మళ్లీ చలి ఉంటుంది.


వందే.. ఓరుగల్లు!

నేడు ఉమ్మడి జిల్లా మీదుగా వందేభారత్ రైలు

- ఐదు స్టేషన్లలో ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం
- అటు హైదరాబాద్, ఇటు విశాఖపట్నానికి తొందరగా చేరుకునే వీలు
- అత్యాధునిక వసతులతో కూడిన హాల్టింగ్ వరంగల్‌లోనే..
- ప్రారంభ వేడుకల్లో పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, వరంగల్: ఓరుగల్లు మీదుగా ఆదివారం వందేభారత్ రైలు పరుగులు తీయనుంది. మొదటి రోజు ప్రధాన స్టేషన్లలో ఒక్కో నిమిషం హాల్టింగ్ ఇచ్చారు. సూపర్‌ఫాస్ట్ రైలు గంటకు 60కిలోమీటర్లతో వెళ్తే.. అత్యాధునిక వసతులతో కూడిన ఈ వందే భారత్ రైలు గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెట్టనుండడంతో గమ్యస్థానాలకు తొందరగా ప్రయాణికులు వెళ్లనున్నారు. వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలన్నా.. వరంగల్ నుంచి ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లాలన్నా గతంలో కంటే గమ్యస్థానం తొందర చేరుకోవచ్చు. ముఖ్యంగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు కేవలం 2.09 గంటల్లో చేరుకోవచ్చు. వరంగల్ నుంచి ఖమ్మం గంటా తొమ్మిది నిమిషాల్లో, వరంగల్ నుంచి విజయవాడ 3.04 గంటల్లో, వరంగల్ నుంచి రాజమండ్రి 4.22 గంటల్లో, వరంగల్ నుంచి విశాఖపట్నం 7.34 గంటల్లో చేరుకోనుంది. కాగా.. ప్రత్యేకంగా వరంగల్ జిల్లాకు బెర్త్‌ల రిజర్వేషన్ కేటాయింపులు ఏమీ ఉండవు. సాధారణంగా అన్ని రైళ్లలాగానే దీనికి రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

వరంగల్‌లో నిమిషం పాటే హాల్టింగ్..
రైలు ప్రారంభమయ్యే ఆదివారం రోజు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు 21 స్టేషన్లలో ప్రజల సందర్శనార్థం ఆపనున్నారు. ఉమ్మడి వరంగల్‌లో జనగామ, కాజీపేటలో, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్.. ఒక్కో స్టేషన్లలో నిమిషంపాటు వందే భారత్ రైలు ఆగనుంది. ఆయా ప్రాంతాల్లోని ముఖ్య ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు కూడా ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్నారు. అయితే సోమవారం నుంచి నడిచే రెగ్యులర్ సర్వీస్‌లో ఉమ్మడి వరంగల్‌లో ఒక్క వరంగల్ రైల్వే స్టేషన్‌లో మాత్రం హాల్టింగ్ ఉంది. అప్‌అండ్‌డౌన్ సమయాల్లో నిమిషం మాత్రమే ఈ రైలు ఇక్కడ ఆగనుంది.



ఆదివారం టైమింగ్స్(ఒక్కరోజే)

- సికింద్రాబాద్ నుంచి ఉదయం 10.30 గంటలకు బయలద్దేరుతుంది.
- భువనగిరిమీదుగా – జనగామకు 11.34 చేరుకుంటుంది. 11.35కు బయలుదేరుతుంది.
- కాజీపేట జంక్షన్‌కు 12.00 గంటలకు చేరుకుంటుంది. 12.01కు బయల్దేరుతుంది.
- వరంగల్ స్టేషన్‌కు 12.14 గంటలకు చేరుకుంటుంది. 12.15కు బయల్దేరుతుంది.
- మహబూబాబాద్ స్టేషన్‌కు 12.55గంటలకు చేరుకుని.. 12.56కు బయల్దేరుతుంది.
- డోర్నకల్ స్టేషన్‌కు 01.12 గంటలకు చేరుకుని.. 01.13కు ఖమ్మం బయల్దేరుతుంది.

నోట్: వరంగల్ రైల్వేస్టేషన్ అధికారులు తెలిపిన సమాచారం మేరకు టికెట్ ధరలు (ఇందులో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.)

వరంగల్ నుంచి వందేభారత్ చార్జీల వివరాలు.. (రూ.లలో)

స్టేషన్	చైర్‌కార్ (ఏసీ)	ఎగ్జిక్యూటివ్ క్లాస్ (ఈసీ)	కి.మీ
ఖమ్మం	520	990	108
విజయవాడ	685	1,320	208
రాజమండ్రి	1,150	2,045	357
విశాఖపట్నం	1,475	2,730	557
సికింద్రాబాద్	725	1,235	142

ఇతర స్టేషన్‌లనుంచి చార్జీల వివరాలు.. (రూ.లలో)

స్టేషన్	చైర్‌కార్ (ఏసీ)	ఎగ్జిక్యూటివ్ క్లాస్ (ఈసీ)
సికింద్రాబాద్-వరంగల్	520	1,005
ఖమ్మం-వరంగల్	470	900
విజయవాడ-వరంగల్	635	1,230
రాజమండ్రి-వరంగల్	985	1,855
విశాఖపట్నం-వరంగల్	1,310	2,540

రెగ్యులర్ సర్వీసు ఇలా..



వందేభారత్ రైలు రెగ్యులర్ సర్వీసు కేవలం వరంగల్ రైల్వేస్టేషన్‌లో మాత్రమే హాల్ట్ కానుంది. విశాఖపట్నం నుంచి వచ్చే రైలు నంబర్ 20833 వరంగల్‌లో మధ్యాహ్నం 12.05 గంటలకు రానుంది. 12.06 గంటలకు బయల్దేరి వెళ్లనుంది. సికింద్రాబాద్‌నుంచి వచ్చే రైలు నంబర్ 20834 వరంగల్‌కు సాయంత్రం 4.35 గంటలకు వచ్చి 4.36 గంటలకు బయల్దేరి వెళ్లనుంది.

న్యూస్‌రీల్

ముగ్గులు.. సంప్రదాయానికి ప్రతీక



మరిపెడ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ల ఎదుట రంగవల్లులతో వేసే ముగ్గులు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయని జగిత్యాల కలెక్టర్ గుగులోతు రవినాయక్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తన స్వగ్రామమైన తండధర్మారం గ్రామానికి కలెక్టర్ వచ్చారు. ఈ పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ.. నిత్య అభ్యసనతో ముగ్గులు వేయడం ఓ వ్యాయామంలా కూడా మహిళలకు ఎంతో దోహదపడుందన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించుకుంటూ ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కలెక్టర్ దంపతులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్‌ను ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు దంపతులు శాలువాతో స న్మానించారు. మాజీ ఎంపీపీ వెంకన్న, సర్పంచ్ లక్ష్మీలక్పతి, మాజీ సర్పంచ్ బాబునాయక్, ఉపసర్పంచ్ సెల, కోబల్‌సింగ్, తిరుపతి, హచ్చు పాల్గొన్నారు.

'వందేభారత్' హాల్టింగ్ ఇవ్వాలి

నెహ్రూసెంటర్: వందేభారత్ రైలుకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు కోరారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసి శనివారం స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపించిన అనంతరం ఆయన మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వేలో హైదరాబాద్, విజయవాడ మార్గంలో మహబూబాబాద్ గుర్తింపు పొందిన రైల్వేస్టేషన్‌గా ప్రయాణికుల రద్దీపరంగానే కాకుండా ఆదాయాన్ని సమకూరుస్తున్న స్టేషన్‌గా మహబూబాబాద్ ఉందన్నారు. మహబూబాబాద్ పట్టణ, జిల్లా, పార్లమెంట్ కేంద్రంగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రైలు మార్గం ద్వారా ప్రయాణం సాగిస్తున్నార న్నారు. తెలంగాణలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మానుకోటలో వందేభారత్ రైలు హాల్టింగ్ ఇవ్వడం వలన ఇక్కడి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు త్వరగా వెళ్తారని తెలిపారు. వందేభారత్ హాల్టింగ్‌తో పాటు మరికొన్ని రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలని, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

ఆహారం గొంతులో అడ్డుపడి యువతి మృతి



కొత్తగూడ: తినే ఆహారం గొంతులో అడ్డుపడి యువతి మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలో శనివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామల నాగరాజు–వసుంధర చిన్న కూతురు ప్రత్యూష(22) హైదరాబాద్‌లో ఒక ప్రవేటు కంపనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం తోటి ఉద్యోగులతో కలసి భోజనంచేసే క్రమంలో ఆహారం గొంతుకు అడ్డువచ్చి పలమారింది. దీంతో అన్నం మెతుకులు ఊపిరితిత్తుల్లోకి వెళ్లాయి. గమనించిన ఉద్యోగులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ.. మృతి చెందింది. దీంతో పండగ పూట కుటుంబంలో విషాదం నెలకొంది.

భారత్ భవిష్యత్‌కు మార్గం ఖమ్మం సభ

- రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, మహబూబాబాద్: వెనుకబడిన భారతదేశం అభివృద్ధికి మార్గం చూపేలా ప్రణాళికతో వెళ్తున్న పార్టీ భారత రాష్ట్ర సమితి అని, ఈనెల 18న ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే బహిరంగసభ దేశ భవిష్యత్‌కు దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పూర్వం నుంచి ప్రపంచ దేశాలకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన చరిత్ర భారత్‌కు ఉందన్నారు ఇంతటి ప్రాధాన్యత ఉన్న దేశం నిన్నమొన్న స్వాతంత్ర్యం సాధించుకున్న దేశాల కన్నా వెనబడి ఉందని, ఇందుకు కారణం మన దేశాన్ని పాలించిన పాలకుల అసమర్థత అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన స్వల్ప కాలంలోనే దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శ పాలన అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అన్నారు. తెలంగాణ మాదిరిగానే దేశం ప్రగతి పథంలో నడవాలంటే కేసీఆర్ నాయకత్వంలో అవసరం అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. ఖమ్మం బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సత్యవతి పిలుపునిచ్చారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మానుకోట
మహబూబాబాద్: మానుకోట జిల్లాకు సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేశారని, మానుకోట ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మంలో ఈనెల 18న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఖమ్మం బహిరంగ సభకు మానుకోట జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లా నుంచి కూడా జనసమీకరణ జరుగుతుందని చెప్పారు. ఖమ్మంలో సభ మూలంగానే మానుకోటలో సభ నిర్వహించలేదని వచ్చే నెలలో సీఎం కేసీఆర్ పర్యటన జిల్లాలో ఉంటుందన్నారు. ఈఏడాదిలోనే ఎన్నికలు రాబోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు జరుగడం లేదన్నారు. దేశ ప్రజలకు సేవ చేసేందుకే సీఎం కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్,, యాఖుబ్‌రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, జనార్దన్, గద్దె రవి, గోగుల రాజు, గుగులోత్ సుచిత్ర, శ్రీనాద్‌రెడ్డి , చంద్రమోహన్, గోవింద్‌నాయక్, రావుల రవి చందర్ రెడ్డి, ఎర్రబెల్లి మాదవి, రఘు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం
పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని రాష్ట్ర మంత్రి సత్యవతి అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో 79 మంది లబ్దిదారులకు మంత్రి శనివారం చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, నూకల నరేష్‌రెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం

- హాజరైన రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు



కల్యాణంలో పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: మండలంలోని హరిపిరాల, పట్టణంలోని 10వ వార్డులో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిపిరాలలోని రంగనాథస్వామి ఆలయం, పట్టణంలోని గోపాలస్వామి ఆలయ ప్రాంగణాల్లో నిర్వహించిన కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం అర్చకులు కల్యాణం నిర్వహించారు. అంతకుముందు రంగనాథునికి పంచామృతాభిషేకాలు, అలంకార సేవలు, అర్చనలు జరిగాయి. రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని, భక్తి భావనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, హరిపిరాల సర్పంచ్ రావుల మమతారెడ్డి, ఎంపీటీసీ గోపమ్మ, నాయకులు దొంగరి శంకర్,రామిని శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాస్, గజానంద్, కొలుపుల శంకర్, జంపన్న, ఆశయ్య, జలగం స్వామిలు పాల్గొన్నారు.

అమీనాపురంలో..
కేసముద్రం: అమీనాపురంలోని శ్రీభూనీలా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదారంగనాథ స్వామి కల్యాణ వేడుకలకు కనులపండువగా నిర్వహించారు. ధనుర్మాసం చివరిరోజు సందర్భంగా ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, హరిస్వామి ఆధ్వర్యంలో 8 మంది దంపతులు, భక్తుల నడుమ పూజా కార్యక్రమాలు కల్యాణం చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వద్దిరాజు దేవేందర్, ధర్మకర్తలు వోలం రాజు, అంబటి మ హేందర్‌రెడ్డి, మురళీ, చిదురాల వసంతరావు, పోకల శ్రీనివాస్, సుధాకర్, సమ్మయ్య, చంద్రుడు, క్రిష్ణమూర్తి, చీకటి వెంకట్రాంనర్స య్య, వెంకటేశ్వర్లు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సంక్రాంతి సందడి

సంక్రాంతి.. ధాన్యరాసులతో అన్నదాత ఇంట నవకాంతి. నక్షత్ర గమనాలు మారే వేళ వచ్చే సంక్రాంతి రైతుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని ప్రార్థించే సమయం. మట్టితల్లితో మమేకమయ్యే కర్షకుడు.. కాడెడ్లకు కాస్త విశ్రాంతి కల్పించి ఆనందంగా కుటుంబ సభ్యులతో గడిపే సందర్భం.. మొత్తంగా ఆడబిడ్డలు ఇళ్లు చేరగా.. బంధువులంతా ఒక్కచోట కలిసి.. ముంగిళ్లలో రంగుల హరివిల్లులు దర్శనమివ్వగా ఆనందంగా సాగే వేడుక.. సంక్రాంతి.



జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర బజార్లో గంగిరెద్దులవారికి ధాన్యం ఇస్తున్న మహిళలు

ఇళ్ల ముంగిట రంగవల్లులు

- జిల్లా నుంచి కోడి పందేలకు పలువురు..

సాక్షి, మహబూబాబాద్: ధాన్యరాసులు పండి, ఇంటి నిండాపంటలతో తులతూగే వేళ సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికే పండుగ సంక్రాంతి. గతంలో పోలిస్తే జిల్లాలో సాగునీటి కష్టాలు లేవు. వరి సాగు పెరిగింది. పుట్లకొద్ది ధాన్యం పండింది. ధాన్యం అమ్మిన డబ్బులు రైతుల ఖాతాల్లో పడ్డాయి. దీంతో రైతులు సంక్రాంతి సంబురాల్లో నిమగ్నమయ్యారు.

రంగవల్లుల సందడి
సంక్రాంతికి స్వాగతం పలికేందుకు జిల్లాలోని ప్రతీ ఇంటి ఎదుట రంగవల్లులు వేసి అందంగా తీర్చిదిద్దారు. భోగి పండుగ రోజు మంటలు వేయడం, పిండి వంటలు, బంధువులను ఇండ్లకు ఆహ్వానించడంలో నిమగ్నమయ్యారు. అయితే గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్ జిల్లాలో గిరిజన మహిళలు పోటీపడి ముగ్గులు వేశారు. రాజకీయ ప్రముఖులు, విద్యాసంస్థలు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో గోదా కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులతో దేవాలయాలు కిట కిటలాడాయి.



వీరభవన్ ఎదుట నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



ముగ్గు వేస్తున్న యువతి

మానుకోట టు ఏపీ
ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది సంక్రాంతికి పలువురు మానుకోట నుంచి ఆంధ్రప్రదేశ్ బాట పట్టారు. ఏపీలో సంక్రాంతికి జరిగే కోడి పందాలను చూసేందుకు కొందరు వెళ్తే.. పందెం ఆడేందుకు పలు గ్రూపులు వెళ్లినట్లు సమాచారం. గతంలో జిల్లాలోని బయ్యారం, గార్ల మండలాల్లో కోడి పందాలు నిర్వహించిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది పందాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిసింది. పందేలపై ఆసక్తి ఉన్నవారు ఏపీలోని భీమవరం, రాజోలు, జంగారెడ్డిగూడెంతోపాటు తెలంగాణ సరిహద్దులోని అశ్వరావుపేట ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం. అయితే సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో వారం రోజులుగా ఉరుకులు పరుగులు పెట్టిన అధికారులు, నాయకులు సీఎం సభ సక్సెస్‌తో సంక్రాంతి పండుగ ప్రశాంతంగా జరుపుకునే అవకాశం వచ్చింది. పండుగకు ముందురోజునే కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లా అధికారులను అభినందించారు. సెలవులు రావడంతో అధికారులు కుటుంబాలతో గడిపేందుకు సమయం దొరికింది.

బొమ్మల కొలువులు, చిన్నారులకు భోగిపండ్లు



భోగిమంటలు కాగుతున్న ప్రజలు



చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న అర్చకులు సుధాకరశాస్త్రి దంపతులు

మహబూబాబాద్ రూరల్: భోగిని పురస్కరించుకొని మానుకోటలో శనివారం పలువురి ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. మహిళలు వాకిళ్లలో ముగ్గులు వేసి నవ ధాన్యాలతో గొబ్బెమ్మలు పెట్టి పండుగ చేసుకున్నారు. పలువురి ఇళ్లలో వ్రతాలు ఆచరించి, ఆలయాల్లో పూజలు చేశారు. పట్టణంలోని బ్రాహ్మణోత్తములు బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహమూర్తి, దుర్గాప్రసాద్, మార్వాడి సత్రం అర్చకులు కలివెండి రాంమోహన్‌శర్మ, పార్వతి రామలింగేశ్వర ఆలయ అర్చకులు రంగావఝుల సుధాకరశాస్త్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఠాకూర్ శ్రీధర్‌సింగ్ నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. పట్టణ ప్రజలు తమ ఇళ్లలోని పాత కర్రలు, ఇతర సామాన్లను భోగి మంటల్లో వేశారు. సంప్రదాయ ముగ్గులతోపాటు, పలు రంగులతో ముగ్గులను అల్లి మహిళలు మురిసిపోయారు. భద్రకాళి అమ్మవారు, పతంగులు, చెరకు గడలు, వెన్న కుండ, డప్పులు, గంగిరెద్దు, కోడిపందెం గుర్తులను రంగు రంగులతో నింపారు.

బాబాయికి గుడి!

- నిత్య పూజలు నిర్వహిస్తున్న అన్నకుమారుడు



పూజలు చేస్తున్న లింగ్యానాయక్, కవిత, అర్చకులు నాగార్జునాచార్యులు

మహబూబాబాద్ రూరల్: తమ బాబాయి మృతి చెందగా ఆయనపై ఉన్న అభిమానం, బాబాయి బతికున్నప్పుడు చూపించిన భక్తి భావానికి గుర్తుగా ఆయన అన్న కుమారుడు బాబాయి పేరు మీద గుడి కట్టించి నిత్య పూజలు చేయిస్తున్నాడు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు వార్షిక పూజల పేరు మీద ఆ కుమారుడితో పాటు తండావాసులు కూడా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధి చౌలతండాకు చెందిన రాంకోటి కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయన బతికున్నప్పుడు ఎంతో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండగా మృతి చెందాక దేవుని రూపంలో కనిపించాడనే విశ్వాసంతో అతని అన్న కుమారుడు లింగ్యానాయక్, కోడలు కవిత ఆధ్వర్యంలో రాంకోటి బాబా పేరుమీద తండాలో 5 ఏళ్ల క్రితం గుడి కట్టించారు. రాంకోటి విగ్రహ ప్రతిష్టాపన చేసి ప్రతి రోజు నిత్యపూజలు చేస్తున్నారు. ప్రత్యేకంగా సంక్రాంతికి వార్షిక పూజ పేరిట అందరికి మేలు కలగాలని పూజలు చేయిస్తున్నారని పురోహితులు గుండోజు నాగార్జునచార్యులు తెలిపారు.



వీరభద్రుడికి వీరబోనం


స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచివున్న భక్తులు


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

- కుమ్మరులు, శివసత్తులతో సమర్పణ
- ఘనంగా భోగి వేడుకలు
- నేడు సంక్రాంతి సంబురాలు

భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో భోగి పర్వదిన వేడుకలు శివసత్తులు, కుమ్మరుల నృత్యాల మధ్య శనివారం ఘనంగా జరిగాయి. భక్తజనం భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కడిపికొండ, ఉల్లిగడ్డదామెర గ్రామాలకు చెందిన కుమ్మరులు ప్రత్యేక ఎడ్లబండ్ల రథాల ద్వారా ఆలయానికి చేరుకొని ఆనవాయితీ ప్రకారం శివసత్తులతో కలిసి వీరబోనం సమర్పించారు. మహిళలు గుమ్మడి కాయలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు గండ దీపాలు వెలిగించగా, మరికొందరు కోడె మొక్కు చెల్లించారు. జెడ్పీటీసీ వంగ రవి, దేవాదాయ, ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రమాల సునీత, ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్‌రావు, ఎంపీడీఓ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మార్పాటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, ధర్మకర్తలు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎల్కతుర్తి సీఐ శ్రీనివాస్, ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. ముల్కనూర్, వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ముల్క నూర్ ఏకేవీఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు భక్తులకు సాయపడ్డారు. కందుకూరి జగదీశ్వర్ ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.


గండ దీపం వెలిగిస్తున్న భక్తులు


కోడె మొక్కు చెల్లిస్తూ..


కారుపై ప్రభను తీసుకెళ్తున్న భక్తులు

కొత్తకొండకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపిస్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ మాధవరావు తెలిపారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లోని ప్రత్యేక శిబిరంలో శనివారం బస్సు సర్వీసులను ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణం చేసి కొత్తకొండ వీరభద్రస్వామి ఆశీస్సులు పొందాలని భక్తులకు సూచించారు. కాగా, పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30 చార్జీ వసూలు చేస్తున్నట్లు వరంగల్ -1 డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ ట్రాఫిక్ భవానీ, లింగారెడ్డి, సాంబయ్య, పాషా, సీఆర్‌సీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న మాధవరావు

చరిత్రలో నిలిచేలా బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ

మహబూబాబాద్‌కు నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు

- 100 పడకల ఆస్పత్రిగా తొర్రూరు పీహెచ్‌సీ
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

తొర్రూరు: దేశ చరిత్రలో నిలిచేలా ఖమ్మం వేదికగా ఈ నెల 18న బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ఆవిర్భావ సభకు జన సమీకరణపై తొర్రూరులోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు క్యాంపు కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డోర్నకల్, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, సండ్ర వెంకటవీరయ్యలతో కలిసి మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఉద్యమ పార్టీ టీఆర్‌ఎస్ జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. నేడు తెలంగాణ ఆచరించింది.. రేపు దేశమంతా అనుసరిస్తోందన్నారు. మిషన్ కాకతీయను అమృత్ సరోవర్ పేరుతో, రైతు బంధును పీఎం కిసాన్ పేరుతో కేంద్రం అమలు చేస్తోందని గుర్తు చేశారు. కేంద్రం గ్రామాలకు అవార్డులు ఇస్తే 10కి 10 తెలంగాణకే వచ్చాయన్నారు. దేశంలో 18లక్షల ఉద్యోగ ఖాళీలుంటే ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? నిరుద్యోగం పెంచే, యువతను వంచించే బీజేపీ కావాలా అని ప్రశ్నించారు. జనగామ, భూపాలపల్లిలో కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయనున్నామని, తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని ప్రకటించారు. మహబూబాబాద్‌లో ఈ ఏడాదే పారామెడికల్, నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తామని చెప్పారు. 18న ఖమ్మంలో నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ దేశ రాజకీయాల్లో పెనుమార్పులకు దారి తీస్తుందని తెలిపారు. అనంతరం మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ నాలుగు జిల్లాలు, 12 నియోజకవర్గాల నుంచి 5 లక్షల మందితో ఖమ్మంలో పార్టీ ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నామన్నారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 1.20 లక్షల మందిని సభకు తరలించాలన్నారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, యూపీ మాజీ సీఎం, సీపీఎం, సీపీఐ జాతీయ కార్యదర్శులు, జాతీయ నాయకులు పాల్గొంటున్న ఈ సభకు జాతీయ స్థాయి ప్రాధాన్యం ఉందన్నారు. సమావేశంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, ఈదురు ఐలయ్య, నర్సింహానాయక్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీలు గుడి వంశీధర్‌రెడ్డి, రంగు కుమార్, ఈజీఎస్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, నాయకులు రామచంద్రయ్యశర్మ, కిషోర్‌రెడ్డి, రాజేష్‌నాయక్, దేవేందర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టమాట కూర పంచాయితీ

- తల్లిపై తనయుడి దాడి..
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇస్లావత్ బుజ్జి

మహబూబాబాద్ రూరల్: 'పొయ్యిపై టమాటాలు మాడిపోయాయి చూడవద్దా కొడుకా' అని తల్లి అడిగినందుకు తనయుడు తల్లి తలపై సుత్తెతో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం వేమునూరు గ్రామశివారు ఇస్లావత్‌తండాలో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన ఇస్లావత్ బుజ్జి కోడలు నందిని సంక్రాంతి పండుగ కోసమని తన తల్లిగారిల్లు అయిన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని సాంక్రియాతండాకు శుక్రవారం సాయంత్రం వెళ్లింది. అంతకుముందు నుంచే కోడలికి, అత్త మధ్య చిన్నచిన్న తగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం బుజ్జి ఉదయం టమాట కూర వండుతుంది. అవి ఉడుకుతుండగానే.. ఇంటి ఆవరణలో మిరపకాయలు రోట్లో నూరుతుంది. ఇంట్లోనుంచి మాడిపోయిన వాసన వస్తుంటే.. గిన్నెలోని టమాటాలు వేడికి మాడిపోయాయి. చూడలేదెందుకురా కొడుకా అని కుమారుడు మహేందర్‌ను అడిగింది. దీంతో ఆగ్రహానికి గురైన మహేందర్ నీ వల్లే నా భార్య నందిని తల్లిగారింటికి వెళ్లిందని తల్లితో గొడవ పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న సుత్తె తీసుకుని తలమీద దాడిచేసి గాయపరిచాడు. అతని నాయనమ్మ జంకును కూడా కొట్టాడు. దీంతో బుజ్జి తలకు తీవ్రగాయమైంది. దీంతో జరిగిన సంఘటనపై బాధితురాలు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. బాధితురాలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాగా, తల్లి బుజ్జి తరచూ కోడలితో అన్నం, కూరలు సరిగా వండరాదని ఎత్తిపొడిచేదని కుమారుడు మహేందర్ తెలిపాడు. దీంతో కోపంతో కొట్టినట్లు చెప్పాడు.

భర్తపై భార్య, కుమారుడి దాడి

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తిపై అతడి భార్య, కుమారుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు లింగాల మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత హోలీ ఏంజిల్స్ పాఠశాల సమీపంలో నివాసం ఉండే లింగాల మనోహర్‌కు భార్య శారద, కుమారుడు హవన్ ఉన్నారు. కుటుంబ తగాదాల కారణంగా కోర్టులో కేసు నడుస్తుండగా ఎనిమిదేళ్లుగా భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. సొంతింటిలో ఓ గదిలో మనోహర్, మరో గదిలో శారద, హవన్ నివసిస్తున్నారు. కాగా, బోరు మోటార్ వేసి బంద్ చేసే విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం హవన్ బోరు మోటార్ మీటరును అక్కడ నుంచి తొలగించాడు. ఈ విషయమై మనోహర్ వచ్చి భార్య శారద, కుమారుడు హవన్‌ను అడిగాడు. ఈ క్రమంలో మనోహర్‌ను శారద పట్టుకోగా హవన్ కత్తితో ఆయన తలపై, ఎడమ చేతిపై దాడి చేసి గాయపరిచాడు. తీవ్రగాయాల పాలైన అతడు పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లాడు. మహబూబాబాద్ టౌన్ ఎస్సై విజయ్‌రామ్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుడు లేదా అతడి పక్షాన బంధువులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

హన్మకొండ జూపార్క్‌కు 300 మీటర్ల దూరంలో ఫాల్ సీలింగ్, లిఫ్ట్, జనరేటర్ సౌకర్యంతో కేవలం రూ॥ 55 లక్షలకే 3 BHK ఫ్లాట్ అమ్మబడును. VRR TULP. 6309840767. [WA-6457]

PLOT FOR SALE

ప్రశాంత్‌నగర్ (వడ్డెపల్లి)లో వెడల్పు 30 పొడవు 45 ఫీట్స్ సౌత్ ఫేస్ గల 150 గజాల ప్లాట్స్ అమ్మబడును. సంప్ర॥ 8328047265. [W-775899]

మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లేఅవుట్ 263, 228, 200, 165, 134 గజాల ప్లాట్లకై సంప్రదించండి. సెల్: 9032111600. [W-775766]

LAND FOR SALE

గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడా కలదు. ఫోన్ 9951297569. [HA-868]

SERVICES

అమ్మబడును

రెడ్డి కాలనీ, KU మెయిన్ రోడ్ HNKలో గుడ్ రన్నింగ్‌లో ఉన్న చికెన్ షాప్ 8 కెమెరాస్, మోడరన్ డిజైన్ కలిగి, అన్ని వసతులతో అమ్మబడును. సంప్ర॥ 8121142147, 9912664275. [WA-6458]

SAVE WATER

ఫ్లోగార్డ్ వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో కంట్రోలర్స్ అమర్చబడును. ట్యాంక్ నిండగానే ఆటోమెటిక్‌గా మోటరు బంద్ అగును. సెల్: 8464856262. HNK. [WA-2393]

VISION WATER PURIFIERS

Best RO Water Purifiers in Warangal. All Water Purifiers Sales & Service. Sankranthi Offers 20% Discount. Cell: 9652104848, 8499004848. [W-775897]

FINANCE

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL. 9618767116 [W-775941]

VISION WATER PURIFIER

New year Offers 50% Discount All Purifier Sales & Service. Cell: 8499004848, 9652104848. [WA-6452]

WANTED

Wanted Accountant. Prefered Qualification, Solid Education Back ground (Bachelors Degree preferred) Efficient in Tally Prime & MS Office Fluent in English, Telugu and Hindi Please send your resume to info@primetextiles.in Last date to Apply 17-01-2023 interview follows for impressive profiles. [WA-972]

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోం కేర్ సర్వీస్ 24॥ వృద్ధులను, పెద్ద వారిని, పేషెంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి, ఇంటి పని, వంట పని చేయుటకు మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని, స్త్రీ, పురుషులను పంపించగలము. సెల్: 8897730132, 8186926067. [W-1170509]

కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డులో పూల దుకాణం నడిపేందుకు అబ్బాయి కావలెను. సంప్ర॥ 9866252062. [W-775767]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్:9848571888, 7569955551. [H-786819]

హనుమకొండలోని టిఫిన్ సెంటర్లో పనిచేయుటకు అనుభవజ్ఞుడైన మాస్టర్ కావలెను. సెల్ నెం: 8008255152. [W-775770]

Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9505507558, 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.